సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం, 23, మే, 2025



స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి 10లో



విభజన సా..గుతోంది..! 10లో



నగరంలో మళ్లీ కరోనా
- పిఠాపురం కాలనీలో కలకలం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం

10లో

న్యూస్‌రీల్

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజశేఖర్



విశాఖ-లీగల్ : వేసవి సెలవుల దృష్ట్యా పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సెలవుల్లో ఉండడంతో, ఆయా కోర్టులకు సంబంధించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజశేఖర్ 15 రోజులపాటు విశాఖపట్నంలోని కొన్ని కోర్టులతో పాటు యలమంచిలిలోని కోర్టులకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

ఏయూ ఇంజినీరింగ్ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీల్లో **2025–26 విద్యా సంవత్సరం** ప్రవేశాలకు **షెడ్యూల్ జారీ చేశారు.** ఇటీవల నిర్వహించిన **ఏయూఈఈటీ–2025** ఫలితాలు ఇప్పటికే విడు**దల చేశారు. ఈ నెల** 24న విద్యార్థులు ర్యాం**క్‌కార్డులను డౌన్‌లోడ్** చేసుకునేలా వెబ్‌సైట్‌**లో వాటిని అందుబా**టులో ఉంచుతున్నట్లు **అడ్మిషన్ల విభాగం డీన్** డీ.ఏ.నాయుడు గురువా**రం ఒక ప్రకటన విడు**దల చేశారు. ఈ నెల **26 నుంచి ఆన్‌లైన్‌లో** విద్యార్థులు రిజిస్ట్రేషన్ **చేసుకోవాలన్నారు. ఈ** నెల 26 నుంచి 30 వర**కు విద్యార్థులంతా ఆన్‌**లైన్‌లో తమకు సంబం**ధించిన అన్ని రకాల** విద్యార్హతల ధ్రువీకరణ **పత్రాలను అప్‌లోడ్** చేయాలన్నారు. జూన్1 **నుంచి 3 వరకు వెబ్** ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నా**రు. జూన్ 5న ఎంపికైన** విద్యార్థుల జాబితాను ప్ర**కటిస్తామన్నారు.**

అంతర్జాతీయ స్థాయిలో శశిధర్ ప్రతిభ



బీచ్‌రోడ్డు: నగరానికి చెందిన శశిధర్ పైడిరాజు పాండ్రాడ భారతీయ నృత్య రీతుల్లో తన అద్భుత ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల దుబాయ్‌లో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆఫ్ దుబాయ్, పిరమిడ్ యోగా అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో శశిధర్ పాల్గొన్నారు.

ఈ పోటీల్లో సాయినాథ్ కళా కమిటీ, ఎస్‌కేఎస్ అకాడమీకి చెందిన అరుణ్ కుమార్ సాయి బృందాలు కూడా భారత్ తరపున తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాయి. శశిధర్ తన విభిన్న నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించి, ఇండియన్ కాన్సులేట్ ప్రతినిధి అరుజిత్ మిశ్రా చేతుల మీదుగా 'యువ ప్రతిభ' అవార్డును అందుకున్నారు. కళారంగంలోనే కాకుండా, ఫ్యాషన్ రంగంలోనూ శశిధర్ తన ప్రతిభను చాటుకుంటూ అందరి అభినందనలు పొందుతున్నారు.

బాల 'మందిరం'



బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిరం తరహా సెట్ నగరవాసులను, ముఖ్యంగా చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంది. గురువారం నుంచి సందర్శనకు అనుమతించడంతో, పెద్ద సంఖ్యలో ప్రజలు 'విశాఖ అయోధ్య'ను దర్శించుకోవడానికి తరలి వచ్చారు. చిన్నారులు ఈ అద్భుతమైన సెట్ వద్ద సందడి చేస్తూ ఆనందంగా గడిపారు. నిజమైన రామమందిరం వాతావరణాన్ని తలపించేలా తీర్చిదిద్దిన ఈ సెట్, నగరానికి సరికొత్త ఆధ్యాత్మిక శోభను తెచ్చిపెట్టింది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మేఘాల కౌగిలిలో విశాఖ



విశాఖపై ప్రకృతి తన అద్భుత రంగులను ప్రదర్శించింది. గురువారం నల్లటి మబ్బులు ఆకాశాన్ని ఆవరించగా, అవి సాగరతీరం నుంచి బీచ్ రోడ్డును కౌగిలించుకున్నట్లుగా దర్శనమిచ్చాయి. మేఘాలు భూమిని తాకుతున్నాయా అన్నంత దగ్గరగా వచ్చి, కనుల పండువ చేశాయి. ఈ అపురూపమైన వాతావరణానికి నగరవాసులు ఫిదా అయ్యారు. ఉరుములు, మెరుపులు లేకుండా, కేవలం మబ్బుల మందారంతో అలరించిన ఈ దృశ్యం, నగరానికి సరికొత్త అందాన్ని తెచ్చింది. చల్లటి గాలులు వీచడంతో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



జై హనుమాన్

జిల్లా వ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా హనుమంతవాక దేవాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కబ్జాలో ఘనుడు

- 4 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి స్వాహా
- రూ. 40 కోట్ల విలువైన భూమి సొంతానికి వినియోగం
- స్విమ్మింగ్ పూల్, రిసార్ట్ నిర్మాణం
- ఫిర్యాదులొచ్చినా నామమాత్రపు చర్యలూ నిల్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఇంత స్పష్టంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రిసార్ట్ ముసుగులో ఎవ్వరూ లోపలికి వెళ్లకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి మరీ కబ్జా పర్వం నడుస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం కనీస చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఈ అక్రమ కబ్జా వ్యవహారంపై నేరుగా కలెక్టరును కలిసి కూటమి పార్టీకి చెందిన నేతలే ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ ఇప్పటికీ కనీస చర్యలు తీసుకోలేదు. ఇందుకు కారణం సదరు రిసార్ట్స్ అధినేతకు కూటమి ప్రభుత్వంలోని తెలుగుదేశం పార్టీ నేతలతో ఉన్న సంబంధాలే. అనకాపల్లి-ఆనందపురం మధ్య జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే ఏకంగా రూ. 40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రిసార్ట్స్ నడుపుతున్న వ్యవహారంపై ఫిర్యాదులొచ్చినా నామమాత్రపు చర్యలు కూడా ప్రభుత్వ యంత్రాంగం తీసుకోవడం లేదంటే విశాఖలో కబ్జాల పర్వం ఎలా సాగుతుందో ఇట్టే అర్థమవుతోంది.



ఘట్టమనేని ఎస్టేట్స్ పేరుతో నడుస్తున్న రిసార్ట్స్

ఈ ఫొటోలో కనిపిస్తోంది ఘట్టమనేని రిసార్ట్స్. అనుమతి లేకుండా లోపలికి వెళ్లేందుకూ అవకాశం లేదు. చుట్టూ కంచె వేసి..ఎవరైనా రూం బుక్ చేసుకుంటేనే వెళ్లేందుకు అనుమతిస్తారు.

రూ. 40 కోట్ల భూమిలో...!

అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలోని నీలకుండీల జంక్షన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఘట్టమనేని ఎస్టేట్స్ పేరుతో నడుస్తున్న రిసార్ట్స్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. దాదాపు 4 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఈ భారీ రిసార్ట్స్‌ను నిర్మించారని తెలుస్తోంది. దీని విలువ సుమారు రూ. 40 కోట్లు ఉంటుందని అంచనా.రిసార్ట్స్‌లో బస చేసేందుకు గదులతో పాటు స్విమ్మింగ్ పూల్, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా వంటి అత్యాధునిక సౌకర్యాలు కల్పించారు. ఇక్కడ రూం బుక్ చేసుకుంటేనే లోపలికి అనుమతిస్తారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, ఎవ్వరూ అనుమతి లేకుండా లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశారు.నిజానికి, సొంత స్థలంలో ఈ తరహా నిర్మాణాలు చేపడితే ఎవరికీ ఎటువంటి అభ్యంతరం ఉండదు. అయితే, ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిని ఆక్రమించి మరీ రిసార్ట్స్‌ను నిర్మించడమే ఇక్కడ విమర్శలకు ప్రధాన కారణం. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలోనే సహజసిద్ధమైన గెడ్డ కూడా ఉంది. ఈ గెడ్డను కూడా ఆక్రమించి, పూర్తిగా కప్పేసి నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలున్నాయి. అంటే, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దర్జాగా రిసార్ట్స్‌ను నడుపుతున్నారన్నమాట.

ఘట్టమనేని రిసార్ట్స్



రికార్డులో పక్కాగా ప్రభుత్వ భూమి...!

ఆనందపురం మండలం గిడిజాల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఘట్టమనేని రిసార్ట్స్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్లు 310-5లోని 2 ఎకరాలు, 311-14లోని 2.04 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని రెవెన్యూ రికార్డులు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రిసార్ట్స్ స్కెచ్‌ను పరిశీలిస్తే, ఈ రెండు సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రిసార్ట్స్ నిర్మాణాలు చేపట్టారని తేటతెల్లమవుతోంది. అంతేకాకుండా, 311-4 సర్వే నెంబరులోని 2.04 ఎకరాల్లో 60 సెంట్ల భూమి సాగుకు అనుకూలమైనదిగా గుర్తించారు. అంటే, పంట భూమిని కూడా ఈ కబ్జా పర్వంలో కలిపేశారు. వీటితో పాటు, సహజసిద్ధమైన గెడ్డలను కూడా ఆక్రమించి, వాటిని పూర్తిగా కప్పేసి రిసార్ట్‌లో విలీనం చేసుకున్నారని ఆరోపణలున్నాయి.


ఫిర్యాదు చేసినా...!

కూటమి పార్టీలోని నేతలే సదరు ఘట్టమనేని అవినీతి కట్టలపై నేరుగా కలెక్టరును కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి మరీ రిసార్ట్స్‌ను నిర్వహిస్తున్నారంటూ స్వామి నాయుడు అనే స్థానిక కూటమికి చెందిన కార్యకర్త ఫిర్యాదు చేశారు. ఇందుకు అనుగుణంగా ఆధారాలను కూడా కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదులో అందజేశారు. అంతేకాకుండా ఇక్కడ పేకాట క్లబ్ నిర్వహించేందుకూ ప్రయత్నిస్తున్నారంటూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ క్లబ్‌పై నిఘా ఏర్పాటు చేయాలని కూడా కోరారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అయితే, అటు రెవెన్యూ యంత్రాంగం నుంచి కానీ ఇటు పోలీసుల నుంచి కానీ నామమాత్రపు చర్యలు కూడా తీసుకునేందుకు వెనుకాడుతున్నారంటే పరిస్థితి ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆనందపురం పోలీసు స్టేషన్‌లో ఏపీ గ్యాంబ్లింగ్ చట్టం కింద ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌పై క్రిమినల్ కేసు నమోదైన విషయాన్ని కూడా తమ ఫిర్యాదులో ప్రస్తావించారు. అయినప్పటికీ ఈ రిసార్ట్‌లో జరుగుతున్న దందాపై కానీ... ప్రభుత్వ భూమి ఆక్రమణపై కానీ చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. సదరు రిసార్ట్స్ అధినేతతో ప్రభుత్వ యంత్రాంగానికి ఉన్న అన్యోన్య సంబంధాల నేపథ్యంలోనూ కిందిస్థాయిలో కనీసం ఫిర్యాదుపై చర్యలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కూటమి ప్రభుత్వంలోని తెలుగుదేశం పార్టీకి ఉన్న దగ్గరి సంబంధాలే కారణమనే విమర్శలు బలంగా ఉన్నాయి.



310-5, 311-14 సర్వే నెంబర్లల్లో స్విమ్మింగ్ పూల్, రిసార్ట్‌లో కొంత భాగం నిర్మాణం జరిగినట్టు చూపుతున్న గూగుల్ స్కెచ్

ఈ గూగుల్ స్కెచ్‌లో కనిపిస్తోంది 310-5, 311-14 సర్వే నంబర్లల్లో స్విమ్మింగ్ పూల్, రిసార్ట్‌లో కొంత భాగం నిర్మాణం.



310-5, 311-14లల్లోని భూమి ప్రభుత్వ భూమి అని చూపుతున్న రెవెన్యూ రికార్డులు

ఈ ఫొటోల్లో కనిపిస్తోంది 310-5, 311-14 సర్వే నెంబర్లల్లోని భూమి ప్రభుత్వ భూమి అని చెబుతున్న రెవెన్యూ రికార్డులు.

మాడుగుల నుంచే ముసలం!

- ఎమ్మెల్యేగా ఉన్నందుకు సిగ్గుపడుతున్నా..
- చర్చనీయాంశమైన బండారు వ్యాఖ్యలు



వేదికపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బండారు

నక్కపల్లి: నిధుల కేటాయింపులో ఎందుకీ వివక్ష.. మాడుగులపై చిన్నచూపు చూస్తున్నారు.. మూడేళ్లపాటు నిధులు ఇవ్వలేమని చెప్పేయండి.. నియోజకవర్గం ప్రజల కాళ్లావేళ్లా పడి అభివృద్ధి గురించి అడగొద్దని ప్రాధేయపడతాను.. అంటూ మినీ మహానాడు వేదికపై సాగిన మాడుగుల ఎమ్మెల్యే, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి వ్యాఖ్యలు కలకలం రేపాయి. అడ్డురోడ్డులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగం వాడిగా వేడిగా సాగింది. ఆయన మాటలతో నేతలంతా ఖిన్నులైపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాడుగుల, చోడవరం నియోజకవర్గాలు బాగా వెనుకబడి ఉన్నాయని, పార్టీ విజయానికి దోహదపడిన ఈ రెండు ప్రాంతాలను పట్టించుకోకపోవడం తగదన్నారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో ముగ్గురు జనసేన పార్టీ వారైతే, టీడీపీ నుంచి గెలిచిన వారిలో ఒకరు స్పీకర్‌గా, మరొకరు హోం మంత్రిగా ఉన్నారని, నిధులన్నీ వారే పట్టుకుపోతున్నారని అర్థం వచ్చేలా బండారు ప్రసంగం సాగింది. పదవుల్లేకుండా ఉన్నది తాను, చోడవరం ఎమ్మెల్యే రాజు మాత్రమేనని ప్రస్తావించడంతో.. మంత్రి పదవి దక్కలేదన్న బాధ బండారు మాటల్లో వ్యక్తమయింది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా తన ప్రసంగంలో.. సీనియర్లకు, కష్టపడిపనిచేసే వారికి ప్రాధాన్యత లేకపోతే మనుగడ కష్టమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు.


పెందుర్తి కూటమిలో కల్లోలం

'నేను పెందుర్తి ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేని. నా మీద టీడీపీ ఇన్‌చార్జిని వేసి అతనికి అధికారాలు ఇస్తామంటే ఎలా..? నియోజకవర్గంలో మాకు తెలియకుండా టీడీపీ నేతలు పనులు చేయించుకుంటున్నారు. టీడీపీ ఇన్‌చార్జిలు అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం ఏంటి? ఇదేనా పొత్తు ధర్మం'అంటూ వీఎంఆర్‌డీఏ వేదికగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేసిన వ్యాఖ్యలు.

'నియోజకవర్గంలో టీడీపీ కేడర్ అంతా కలిసి పనిచేస్తేనే జనసేన ఎమ్మెల్యే పంచకర్ల గెలిచారు. ఒక రకంగా చెప్పాలంటే పంచకర్ల గెలుపు టీడీపీ పెట్టిన భిక్ష. టీడీపీ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే ఇప్పుడు టీడీపీ కార్యకర్తలను పురుగుల్లా చూస్తున్నారు. అందుకే టీడీపీ ఇన్‌చార్జికి కూడా ఎమ్మెల్యేతో సమానంగా అధికారం ఇవ్వాలి'మినీ మహానాడు వేదికపై పెందుర్తి టీడీపీ ముఖ్య నాయకుల తీర్మానం.

'మా నాయకుడు(మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి) పెందుర్తిలో టీడీపీని నిలబెట్టాడు. ఇప్పుడు మమ్మల్ని పార్టీ నుంచి దూరం పెడుతున్నారు. వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి టీడీపీలో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. ఇలా అయితే మా ప్రతాపం కూడా చూపిస్తాం'అంటూ.. బండారు వర్గీయులు బాబ్జీ అనుచరులకు ఛాలెంజ్‌లు చేశారు.

- ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ ఇన్‌చార్జి గండి సిగపట్లు
- నేను కూడా ఉన్నానంటున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు
- వీఎంఆర్‌డీఏ వేదికగా తారాస్థాయికి చేరుకున్న విభేదాలు
- మినీమహానాడులోనూ బహిర్గతమైన కూటమి కయ్యాలు



పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంపై ఆధిపత్యం కోసం టీడీపీ, జనసేన ముఖ్య నేతలు అధికారిక కార్యక్రమాల్లో బాహాబాహీకి దిగితే.. కేడర్ క్షేత్రస్థాయిలో తన్నుకునేందుకు సిద్ధమవుతున్నారు. అధికార యంత్రాంగాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ఓ వైపు జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మరో వైపు టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ తీవ్రస్థాయిలో పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి నేనే సుప్రీం అని పంచకర్ల అంటుంటే.. ఎన్నికల్లో చేసిన మేలుకు ఫలితంగా తనకూ ఎమ్మెల్యేతో సమానంగా గౌరవం ఇవ్వాల్సిందేనని బాబ్జీ భీష్మించుక్కూర్చుంటున్నారు. ఎంతలా అంటే ఏకంగా వీఎంఆర్‌డీఏ సమీక్షలో మున్సిపల్ మంత్రి నారాయణ ముందే తమ అధికారాల కోసం బాహాబాహీకి దిగేంత..!

జుగుప్సాకర చర్యలు

నెల రోజుల క్రితం టీడీపీ నాయకుల పని కోసం గండి బాబ్జీ ఎమ్మెల్యే రమేష్‌బాబుకు ఫోన్ చేస్తే వాళ్ళ కోసం అయితే నువ్ నాకు ఫోన్ చేయొద్దని పంచకర్ల ఘాటుగా సమాధానమిచ్చారట. దీంతో మావాళ్ల పని ఎలా చేయించుకోవాలో నాకు తెలుసు.. అంటూ అదే స్థాయిలో బాబ్జీ విరుచుకుపడినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో కూడా టీడీపీ, జనసేన చోటామోటా నాయకులు ఆధిపత్యం కోసం వీధి రౌడీల కంటే హీనంగా వ్యవహరిస్తున్న దాఖలాలున్నాయి. మరో వైపు టీడీపీలో స్థానికుడైన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, బాబ్జీ వర్గాల మధ్య విభేదాలు రాజుకున్నాయి. పరవాడలో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఏకంగా వీరు కొట్టుకున్నంత పనిచేశారని సమాచారం. అత్యంత జుగుప్సాకరంగా ప్యాంట్లు విప్పి మరీ.. పరస్పరం బూతులు తిట్టుకోవడాన్ని పార్టీ నాయకులే అసహ్యించుకుంటున్నారు.

ఆధిపత్య పోరులో అధికారులే సమిధలు

ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ ఇన్‌చార్జి గండి మధ్య ఎన్నికల నుంచి ఆధిపత్య పోరు నడుస్తోంది. అధికారంలోకి ఎలాగైనా రావాలన్న ఆశతో కలిసి పనిచేశారు తప్ప, అధికారంలోకి వచ్చాక ఉప్పు..నిప్పులానే ఉన్నారు. బాబ్జీ తనకున్న జిల్లా, రాష్ట్రస్థాయి ముఖ్య నేతల పరిచయాలతో సిఫార్సులు చేసి, తన అనుకూల అధికారులను కోరిన చోటుకు బదిలీ చేయించుకున్నారు. అదే సమయంలో పంచకర్ల సిఫార్సులు కొన్ని పనిచేయలేదు. దీంతో పాటు ఇటీవల నియోజకవర్గ అధికారిక కార్యక్రమాల్లో బాబ్జీ చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ కార్యాలయంలోనే ప్రజల నుంచి సమస్యలు స్వీకరించి, అంతా తానే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీఎం సహాయ నిధి చెక్కులు కూడా పంపిణీ చేస్తున్నారు. దీంతో పంచకర్లలో అసహనం మరింత పెరుగుతోంది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సైతం ఇక్కడి వ్యవహారాల్లో తరచూ వేలెడుతున్నారు. వీరి వేధింపులు తట్టుకోలేక కొందరు అధికారులు బదిలీ చేయించుకుని మరీ వెళ్లిపోయారన్న విమర్శలున్నాయి.

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రంలో పార్టీ శ్రేణులు

- తూర్పు సమన్వయకర్తగా మొల్లి అప్పారావే అందుకు ఉదాహరణ
- విశాఖ తూర్పు నియోజకవర్గం ఆత్మీయ సమావేశంలో కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని, దీనికి ఉదాహరణగా మొల్లి అప్పారావును విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడమేనని పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. గురువారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మొల్లి అప్పారావును ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు జాన్‌వెస్లీ, పేర్ల విజయచందర్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి సన్మానించారు అంతకుముందు అప్పారావు విశాఖకు రాగానే ఎయిర్‌పోర్టులో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి సంపత్ వినాయక ఆలయం, పోలమాంబ ఆలయం మీదుగా మద్దిలపాలెం పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దు

ఈ సందర్భంగా కేకే రాజు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేసినప్పటికీ ఓటమి పాలయ్యామని, కార్యకర్తలు నిరుత్సాహపడొద్దని సూచించారు. పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలను వేధిస్తున్నారని, జగనన్న 2.ఓలో వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. విశాఖ తూర్పులో అప్పారావు నేతృత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

జగన్ ప్రోత్సాహంతోనే..

మొల్లి అప్పారావు మాట్లాడుతూ, కార్యకర్త స్థాయి నుంచి సమన్వయకర్తగా ఎదిగానంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహమేనన్నారు. 2029లో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడ మే తన లక్ష్యమని, ఎన్నికలకు నాలుగేళ్ల సమయం ఉన్నందున విశాఖ తూర్పులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కె. సతీష్, పార్టీ నాయకులు రొంగలి జగన్నాథం, గొలగాని శ్రీనివాస్, రవి రాజు, నడింపల్లి కృష్ణంరాజు, ద్రోణంరాజు శ్రీ వాత్సవ, అల్లు శంకర్ రావు, అనిల్ కుమార్ రాజు, రెయ్యి వెంకట రమణ, పల్లా దుర్గారావు, నక్కిల్ల లక్ష్మీ, కేవీ శశికళ, మహమ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనూష, బిపిన్ కుమార్‌జైన్, మంచా నాగ మల్లీశ్వరి, బోని శివరామకృష్ణ, ఉరుకూటి రామచంద్రరావు (చందు), పేడాడ రమణి కుమారి, పులగం కొండా రెడ్డి, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, గున్నంటి పూర్ణానంద శర్మ, దేవరకొండ మార్కెండేయులు, కె.రామన్న పాత్రుడు, సత్యాలసాగరిక పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లకు ఆమోదం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 2024–25, 2025–26 (మే వరకు) ఆర్థిక సంవత్సరాల ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లు, రుణాలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే, చాలా మంది ఉద్యోగుల బిల్లులు సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ల (డీడీవో) లాగిన్‌లో ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు ఏపీజీఎల్ఐ గుర్తించింది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీడీవోలు తమ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లు, రుణాల బిల్లులను ఈ నెల 25లోగా నిధి పోర్టల్‌లో జనరేట్ చేసి, సీఎఫ్ఎంఎస్ ద్వారా సమర్పించాలని ఏపీజీఎల్ఐ సంయుక్త సంచాలకురాలు ఎం.ఝాన్సీ లక్ష్మి కోరారు. అలా చేయని పక్షంలో సాంకేతిక సమస్యల వల్ల బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరిగే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

విభజన సా..గుతోంది!

- వ్యవసాయ విద్యుత్ లైన్ల విభజనపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన విభజన పనులు
- ఆ ప్రభుత్వం మారే సమయానికి 17 శాతం పూర్తి
- ఈ ఏడాది కాలంలో చేసిన పనులు కేవలం ఐదు శాతం మాత్రమే..



సాక్షి, విశాఖపట్నం : రైతు సంతోషంగా నవ్వితేనే.. దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు పక్కగా అమలైతే.. రైతు రారాజుగా పంటలు పండించుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే వ్యవసాయ విద్యుత్ ఫీడర్ల విభజన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కానీ.. ప్రభుత్వం మారిన తర్వాత అన్నదాతపై అక్కసుతో కూటమి సర్కారు.. ఈ ప్రాజెక్టుకి తొలినాళ్లలో కొర్రీ వేసింది. ఫలితంగా విభజన ప్రక్రియ నత్తనడకగా సాగుతోంది.

అంతరాయాల్లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం వ్యవసాయ ఫీడర్ల విభజన ప్రక్రియని 2023లో ప్రారంభించింది. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్డీఎస్ఎస్) ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం నిధులను అందిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 18.42 లక్షల ఎల్టీ, 1,858 హెచ్‌టీ కేటగిరీ విద్యుత్ సర్వీసులున్నాయి. ప్రస్తుతం వీటన్నింటికి ఉమ్మడి విద్యుత్ ఫీడర్ల ద్వారానే సరఫరా జరుగుతోంది. గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు అన్నీ ఒకే లైన్, ట్రాన్స్‌ఫార్మర్, సబ్‌స్టేషన్ పైనే ఉండడంతో సరఫరాలో సమస్యలు వస్తున్నాయి. కొన్ని చోట్ల లోవోల్టేజీ సమస్య, మరి కొన్నిచోట్ల లైను ట్రిప్ అవుతుండడంతో తరుచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీని వల్ల డిస్కమ్ ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విభజన ప్రక్రియ మొదలు పెట్టారు.

ఏడాది కాలంలో కేవలం 5 శాతం మాత్రమే!

వర్షాలు, గాలుల సమయంలో పొలాల్లో ఉన్న విద్యుత్తు స్తంభాలే ఎక్కువగా దెబ్బతింటుంటాయి. వాటి వల్ల గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వ్యవసాయ మోటార్లు వినియోగిస్తున్న సమయంలో కొన్ని గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య కనిపిస్తోంది. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా వ్యవసాయ లైన్లు విభజన జరుగుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 45,602 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటికంటూ ప్రత్యేకంగా విద్యుత్ లైన్లు గానీ, సబ్‌స్టేషన్లుగానీ లేవు. గత ప్రభుత్వ హయాంలో ఈపీడీసీఎల్ పరిధిలో 17 శాతం వరకూ లైన్ల విభజన ప్రక్రియ పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పనులను నిలిపేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పేరొస్తుందన్న ఉద్దేశంతో ఆపాలంటూ ఆదేశించింది. అయితే దీని వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకొని.. పనులు మళ్లీ ప్రారంభించాలంటూ ఈపీడీసీఎల్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆలస్యంగా మొదలవ్వడంతో మరో 5 శాతం విభజన ప్రక్రియ మాత్రమే పూర్తయింది. మొత్తంగా 22 శాతం వరకు మాత్రమే వ్యవసాయ విద్యుత్ ఫీడర్ల విభజన జరిగింది. ఈ ఫీడర్ల విభజన ప్రక్రియ పూర్తయితే.. నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్‌ను గ్రామాలకు అందజేయవచ్చని ఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు.

ఏం చేస్తున్నారంటే..

- ప్రస్తుతం ఉన్న ఫీడర్ల నుంచి వ్యవసాయ ఫీడర్లను వేరు చేసేందుకు రూ.184.83 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రత్యేక లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు.
- ఓవర్ లోడ్ ఉన్న ఫీడర్ల నుంచి వ్యవసాయ ఫీడర్లు విభజన చేసేందుకు మరో రూ.8.80 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- హైవోల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌కు అనువుగా వ్యవసాయ లైన్లని మార్చేందుకు రూ.49.51 కోట్లు కేటాయించారు.

నగరంలో మళ్లీ కరోనా

- పిఠాపురంకాలనీలో కలకలం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం



మహారాణిపేట: నగరంలో మళ్లీ కరోనా కలకలం మొదలైంది. చాలా కాలం తర్వాత ఓ కేసు నమోదైంది. మద్దిలపాలెం ప్రాంతంలో 28 ఏళ్ల మహిళకు కోవిడ్–19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై.. నివారణ చర్యలు చేపట్టింది. పిఠాపురం కాలనీకి చెందిన ఈ మహిళకు ఎటువంటి ప్రయాణ చరిత్ర లేదు. అయినప్పటికీ ఆమెకు కరోనా సోకడం ఆందోళన కలిగిస్తోంది. కొంతకాలంగా ఆమె జ్వరం, దగ్గు, తలనొప్పితో బాధపడుతుండటంతో.. కేజీహెచ్‌లోని మైక్రోబయాలజీ విభాగంలో పరీక్షలు చేయించుకుంది. పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలడంతో.. ఆమెను నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా.. ఈ నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. కరోనా నిర్ధారణ అయిన మహిళ కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు నిర్వహించారు. గురువారం మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, కళాభారతి ప్రాంతాల్లో ప్రజలకు పరీక్షలు చేపట్టారు.

ఆరోగ్యశాఖ సూచనలివీ..

కరోనా వైరస్ మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ కొన్ని సూచనలు చేసింది.

- ప్రార్థనలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో పాల్గొనడం తగ్గించాలి.
- రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, విమానాశ్రయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, గర్భిణులు అనవసరంగా బయటకు రాకూడదు.
- క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- చేతులతో ముఖాన్ని తాకడం మానుకోవాలి.
- రద్దీగా ఉండే లేదా తక్కువ వెంటిలేషన్ ఉన్న ప్రదేశాల్లో మాస్కులు ధరించాలి.
- కోవిడ్ లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలి.
- ఇటీవల కోవిడ్–19 ప్రభావిత దేశాలకు ప్రయాణించిన వ్యక్తులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి.
- అనారోగ్యంగా అనిపిస్తే ఇంట్లోనే ఉండండి. ఇతరులను కలవకండి.

కరోనా సాధారణ లక్షణాలు

జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారటం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు లేదా విరేచనాలు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని లేదా ఆసుపత్రిని సందర్శించి వైద్య సహాయం తీసుకోండి. ప్రజలు మూడు లేయర్ మాస్కులు ధరించాలని వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మె చేస్తాం



నినాదాలు చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపును ఆపాలని, తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లతో ఈ నెల 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులతో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. తమ సమస్యలను యాజమాన్యానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెతోనైనా తొలగింపులు ఆగుతాయని తాము విశ్వసిస్తున్నామన్నారు. యాజమాన్యం మొండి వైఖరిని వీడి తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కాగా.. మూడో రోజు సర్వీస్ జోన్లలో కాంట్రాక్ట్ కార్మికుల హాజరు పెరగగా.. ప్రధాన ఉత్పత్తి విభాగాల్లో కొంత మేర హాజరు తగ్గింది. దీంతో యాజమాన్యం అత్యవసర విధులకు హాజరైన అధికారుల సహాయంతో ఉత్పత్తి ప్రక్రియను కొనసాగించింది. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా యాజమాన్యం కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమావేశం ఏర్పాటు చేసింది. విధులకు హాజరు కావాలని కార్మికులకు తుది సమాచారం ఇవ్వాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని యాజమాన్యం వారికి స్పష్టం చేసింది. వారి స్థానంలో సొంత కాంట్రాక్ట్ కార్మికులను నియమించాలని సూచించింది. దీనిపై కొంత మంది కాంట్రాక్టర్లు సానుకూలత వ్యక్తం చేయగా.. మరి కొంతమంది అభ్యంతరాలు తెలిపినట్లు సమాచారం. ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగితేనే ప్రస్తుతం నెలకొన్న ప్రతిష్టంభన తొలగే అవకాశం ఉంది.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దాబాగార్డెన్స్: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగార్చేలా.. భారీగా పోలీసుల్ని మోహరించి, నిర్బంధ చర్యలకు పాల్పడటం సరికాదని సిటు జిల్లా కార్యదర్శి పి.మణి ఆరోపించారు. ఈ మేరకు గురువారం జగదాంబ జంక్షన్లో సమ్మెకు మద్దతుగా సిటు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఆమె శిరోముండనం చేయించుకున్నారు. కార్మికుల పోరాటానికి సంఘీభావంగా సిటు శ్రేణులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించినట్టు ప్రగల్భాలు పలికినా, ఆ నిధులు ఉత్పత్తి, అభివృద్ధి, కార్మికుల జీతభత్యాలకు కాకుండా కేవలం జీఎస్టీ చెల్లింపులు, అప్పులు తీర్చేందుకు మాత్రమే వినియోగించడం దుర్మార్గమన్నారు. రోజూ యోగా గురించి మాట్లాడేందుకు సీఎం చంద్రబాబుకు టైం ఉంటుంది.. కానీ స్టీల్ ప్లాంట్ సమస్యలపై చర్చించేందుకు మాత్రం సమయం ఉండదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి, మాయమాటలతో మోసం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా శిరోముండనం చేయించుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు వై.రాజు, ఎం సుబ్బారావు, నర్సింగరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు, ఉమ, శైలజ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో గందరగోళాన్ని నివారించాలి

విశాఖ విద్య: ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో అసంబద్ధాలును తక్షణమే సరిచేయాలని, ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో చర్చలు సందర్భంగా పేర్కొన్న అంశాలకు భిన్నంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. రోజుకో మాట, రోజుకో విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని, బదిలీల నిబంధనల అమలులో నిర్దిష్టంగా వ్యవహరించాలన్నారు. లేని పక్షంలో మళ్లీ ఉద్యమ బాట పట్టడం ఖాయమని హెచ్చరించారు.

సిరులతల్లికి రూ.3.65 లక్షల విలువైన హారం బహూకరణ



బంగారు హారం బహూకరిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : మధురవాడకు చెందిన కె. శ్రీనివాసరావు, తన తల్లి కె. వనజాక్షి పేరిట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి రూ. 3,65,000 విలువ చేసే 41.830 గ్రాముల బంగారు హారాన్ని గురువారం బహూకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణికి ఈ హారాన్ని అందజేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి విశేష పూజలు చేయించి, శేష వస్త్రం, ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లను మరికొంత కాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం–తిరుపతి(08547) వీక్లీ స్పెషల్ విశాఖపట్నంలో ప్రతి బుధవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూలై 30 వరకు పొడిగించారు. తిరుపతి–విశాఖపట్నం(08548)స్పెషల్ తిరుపతిలో ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూలై 31 వరకు పొడిగించారు.

- విశాఖపట్నం–చర్లపల్లి(08579) వీక్లీ స్పెషల్ ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూలై 25వ తేదీ వరకు పొడిగించారు. చర్లపల్లి–విశాఖపట్నం(08580)స్పెషల్ ప్రతి శనివారం రాత్రి 7గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూలై 26వ తేదీ వరకు పొడిగించారు.

ఏఎంసీలో మెడికో ఆత్మహత్య

దాబాగార్డెన్స్: ఆంధ్ర మెడికల్ కళాశాల(ఏఎంసీ) పీజీ హాస్టల్‌లో గురువారం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మోతీలాల్ (25) రేడియాలజీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో చేరి కేవలం మూడు నెలలే అయింది. మెరిట్ విద్యార్థి అయిన మోతీలాల్ వ్యక్తిగత కారణాల వల్ల మృతి చెందాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ప్రొఫెసర్ల వేధింపుల కారణంగానే అతను ఆత్మహత్య చేసుకున్నాడని అతని స్నేహితులు ఆరోపిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూటమికి కచ్చితంగా రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

- వైఎస్ జగన్ హయాంలోనే యాదవ సామాజిక వర్గానికి మేలు
- వైఎస్సార్ సీపీ యాదవ సామాజిక వర్గ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యాదవ సామాజిక వర్గ నేతలు

సాక్షి, విశాఖపట్నం: యాదవ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో, చట్ట సభల్లో అధిక ప్రాధాన్యం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ సామాజిక వర్గ నేతలు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ యాదవ సామాజికవర్గ నేతలు పల్లా దుర్గారావు, ఉరుకూటి రామచంద్రరావు, పీతల వాసు, పీతల గోవింద్ మాట్లాడారు. తొలుత యాదవ సామాజిక వర్గానికి రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యం కల్పించింది మహానేత వైఎస్సార్ అయితే, ఆ సంప్రదాయాన్ని ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారని కొనియాడారు. నగర మేయర్‌గా యాదవ మహిళను ఎంపిక చేయడం, ఎమ్మెల్సీ, వీఎంఆర్డీఏ చైర్మన్, డీసీఎంఎస్ పదవులు, ఉత్తరాంధ్రలో ఒక ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం, క్యాబినెట్ స్థాయిలో చైర్మన్ పదవులు, బీసీ కార్పొరేషన్లు, ఇతర బోర్డుల్లో డైరెక్టర్లుగా గౌరవ స్థానాలు కేటాయించారని గుర్తు చేశారు. 2020లో నిర్వహించిన జీవీఎంసీ ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి చెందిన 16 మందికి కార్పొరేటర్ టికెట్లు కేటాయించి, అందులో 13 మందిని గెలిపించారన్నారు. ప్రస్తుతం విశాఖ తూర్పు సమన్వయకర్తగా యాదవ సామాజిక వర్గానికి చెందిన మొల్లి అప్పారావుకు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఉరుకూటి చందుకి అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో పార్టీ పటిష్టత కోసం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడం కోసం అహర్నిశలు శ్రమిస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుల వంటి కీలక సమస్యలపై, పార్టీ మార్గదర్శకత్వంలో పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్మికుల దీక్షకు వైఎస్సార్‌సీపీ నుంచి, యాదవ సామాజిక సంఘాల నుంచి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. మేయర్ పీఠంపై నుంచి యాదవ మహిళను కూటమి నేతలు కుట్రలతో దించేశారని, రానున్న రోజుల్లో వారికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి యాదవ సంఘ మహిళలు, నేతలు సిద్ధంగా ఉన్నారన్నారు. యాదవ సంఘం నేతలు మువ్వల సంతోష్, కొయ్య చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్

భీమిలి కేంద్రంలో ముగ్గురి డిబార్

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. గురువారం జరిగిన ఇంటర్మీడియట్ భౌతిక శాస్త్రం, రాజనీతిశాస్త్రం పరీక్షల్లో భీమునిపట్నంలోని కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా స్క్వాడ్ బృందం గుర్తించింది. దీంతో వారిని డిబార్ చేస్తున్నట్లు ప్రకటించింది. భీమునిపట్నంలోని కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు కొంతమంది ఇన్విజిలేటర్లు సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆనందపురం, భీమునిపట్నం స్టడీ సెంటర్లలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఇక్కడ పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. స్టడీ సెంటర్ల నిర్వాహకులతో చేసుకున్న ముందస్తు ఒప్పందాల మేరకు కొంతమంది ఇన్విజిలేటర్లు మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. భీమునిపట్నం, ఆనందపురం వంటి స్టడీ సెంటర్లలో రెగ్యులర్ విద్యార్థుల కంటే ఓపెన్ విధానంలోనే ఎక్కువ మందికి అడ్మిషన్లు ఇస్తూ.. ఇక్కడి నిర్వాహకులు ప్రైవేటు సంపాదనకు ప్రాధాన్యమిస్తున్నారని మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన రెగ్యులర్ పరీక్షల్లో డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ మాస్ కాపీయింగ్‌ను పూర్తిగా కట్టడి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కానీ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుండటంతో.. డీఈవో ఈ కేంద్రాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే గురువారం ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారు.

నేవిగేటర్, మెరైన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కేంద్రీయ మత్స్య, నావిక, ఇంజినీరింగ్ శిక్షణా విభాగం (సీఐఎఫ్ఎన్ఈటీ) 2025–2027 విద్యా సంవత్సరానికి గానూ వెస్సెల్ నేవిగేటర్/మెరైన్ ఫిట్టర్ కోర్సుల శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ కోర్సులు రెండేళ్ల కాలపరిమితితో కూడిన ట్రేడ్ కోర్సులు. వీటిలో భాగంగా విద్యార్థులకు సముద్రంలో ఫిషింగ్ నౌకలపై ఆచరణాత్మక శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులకు కొచ్చి, చెన్నై, విశాఖపట్నం ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతిలో గణితం, సైన్స్ సబ్జెక్టులలో కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ నాటికి 15 నుంచి 20 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వయసులో ఐదేళ్ల మినహాయింపు ఉంటుంది. www.xifnet.gov.in నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసి జూన్ 16లోగా సమర్పించాలి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మర్రిపాలెం: జ్ఞానాపురం సోఫియా కాలేజీ సమీపంలోని కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కంచరపాలెం స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. గురువారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని కాలువలో పడి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. ప్రస్తుతం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి సంబంధించి ఎవరికైనా వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు. అయితే చనిపోయిన వ్యక్తి భిక్షాటన చేస్తున్నట్టు వారు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తు పడిపోయాడా? మద్యం మత్తులో పడిపోయాడా లేక మతిస్థిమితం లేక పడిపోయాడా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

మా బతుకులతో ఆడుకోవద్దు

ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఎండీయూ ఆపరేటర్ల ధర్నా



జేసీ మయూర్ అశోక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అర్ధాంతరంగా తమను తొలగించి, తమ బతుకులతో కూటమి ప్రభుత్వం ఆటలు ఆడుకోవద్దని ఎండీయూ ఆపరేటర్స్ మొరపెట్టుకున్నారు. నిబంధనల మేరకు 2027 వరకు కొనసాగించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండీయూ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ముందుగా జీవీఎంసీ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎండీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సతీష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎండీయూ ఆపరేటర్లు 9,260 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. 2021 ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీలో విశేష సేవలందిస్తున్నట్లు తెలిపారు. కరోనా, విజయవాడ వరదల సమయంలో రేషన్ పంపిణీలో ఈ విధానం చాలావరకు ఉపయోగపడిందన్నారు. జూన్ 1 నుంచి ఎండీయూ వాహనాలను రద్దు చేస్తున్నామని ప్రభుత్వం చెప్పడం రాష్ట్రంలో ఉన్న ఆపరేటర్ల కుటుంబాలను రోడ్డున పడేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఒప్పందం మేరకు 2027 వరకు అగ్రిమెంట్ ఉందని, అప్పటి వరకు తమను కొనసాగించాలన్నారు. లేదంటే మిగిలిన 20 నెలలకు తమకు రావాల్సిన చెల్లింపుల్ని తక్షణమే చేయాలన్నారు. అనంతరం విశాఖ జేసీని కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాలపరిమితి పూర్తి అయ్యే వరకు కొనసాగించాలి

మహారాణిపేట: మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లను ఒప్పంద కాలం పూర్తయ్యే వరకు కొనసాగించాలని ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సతీష్ కోరారు. గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జేసీని కోరారు.

లారీ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

పీఎంపాలెం: కారుషెడ్ కూడలి వద్ద గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. పీఎంపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి. కారుషెడ్ కూడలిలోని సిగ్నల్ పాయింట్ వద్ద గ్రీన్ సిగ్నల్ రావడంతో.. విశాఖ నగరం నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ ముందుకు పోనిచ్చాడు. అదే సమయంలో సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి లారీ వస్తున్న విషయాన్ని గమనించకుండా రోడ్డు దాటాడు. ఈ క్రమంలో లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తల భాగం నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

కోరాపుట్ వరకే కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: కె.కె.లైన్‌లో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే కిరండూల్ పాసింజర్ కింది తేదీల్లో కోరాపుట్ వరకే నడుస్తుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 26, జూన్ 2, 9వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్(58501) కోరాపుట్ వరకు, కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైలు రాకపోకలు సాగించదు.